క్లుప్తంగా

నృసింహుడి సన్నిధిలో శ్రావణమాస పూజలు


భక్తులకు దర్శనం ఇస్తున్న నృసింహుడు

తుక్కుగూడ: పురపరిధి జెన్నాయిగూడ శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో శ్రావణ మాసం రెండో శనివారం పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారిని రకరకాల పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచేందుకే మాక్ ఎన్నికలు

కందుకూరు: విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే మాక్ ఎన్నికలు నిర్వహించామని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ తెలిపారు. మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులతో మాక్ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పుష్పలత, సునీత, కరుణాకర్, సుమేర, హరీష్ పర్యవేక్షణలో ఏడు విభాగాలకు ఎన్నికలు నిర్వహించారు. 755 మందికి 650 మంది విద్యార్థులు ఓటు వేశారు. స్టూడెంట్ పీపుల్స్ లీడర్‌గా జె.దివ్య, డిసిప్లే లీడర్‌గా ప్రణయ్, క్రీడల నాయకుడిగా జె.వంశీ, గర్ల్ చైల్డ్ లీడర్‌గా జేభా, కల్చరల్ లీడర్‌గా ఏ.దిలీప్, స్వచ్ఛ భారత్ లీడర్‌గా శ్రీవల్లి, స్టెమ్ లీడర్‌గా బి.అక్షయసాక్షిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, కుముదిని, గురురాజారెడ్డి, పరమేశ్వర్, సురేష్, గ్రేస్, జ్యోతి, వెంకటరమణ, పల్లవి, కిరణ్మయి, శేఖర్ పాల్గొన్నారు.

బీమా చెక్కుల అందజేత


నామినీకి చెక్కు అందజేస్తున్న కమిషనర్ వాణి

తుక్కుగూడ: తుక్కుగూడ పురపాలిక పరిధిలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేసిన ఎర్రోల్ల అంజయ్య, వారణాసి రాములు అనారోగ్యంతో మృతి చెందారు. అంజయ్యకు ఈపీఎఫ్ కింద మంజూరైన రూ.5,46,780, రాములకు ఆయిష్మాన్ భారత్ కింద మంజూరైన బీమా రూ.5 లక్షల చెక్కులను బాధిత కుటుంబీకులకు శనివారం మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

ఏఓ లావణ్య


కందుకూరులో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏఓ లావణ్య

కందుకూరు: ప్రస్తుతం రైతుల అవసరం మేరకు మండలంలో యూరియా అందుబాటులో ఉందని ఏఓ లావణ్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని పీఏసీఎస్ గోదాంలు, ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులను ఆమె పరిశీలించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా మొత్తం 70.705 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. పీఏసీఎస్ పరిధిలో 36.64 మెట్రిక్ టన్నులు, ఏఆర్ఎస్‌కేలో 9.9 మెట్రిక్ టన్నులు, ఫర్టిలైజర్ షాపుల్లో 34.065 మెట్రిక్ టన్నుల యూరియా ఉందన్నారు. మరో 20 టన్నులు ఆదివారం వరకు రానుందన్నారు. రైతులు ఇబ్బంది పడాల్సిన పనిలేదని చెప్పారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

లింగోజిగూడ: గతంలో ఎన్నడు లేని విధంగా డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.డివిజన్ పరిధి నారాయణపురి కాలనీలో రూ.12 లక్షలతో చేపట్టనున్న డ్రెయిన్ పనులకు శంకుస్థాపన, అవేర్ గ్లోబల్ ఆసుపత్రి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు రూ.64 లక్షలతో నిర్మించిన సీసీ, బీటీ రోడ్డును శనివారం ప్రారంభించారు. ఈ సందరర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో కాలనీల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీలవాసులు మహేందర్‌రెడ్డి, రఘునాథ్, గుబ్బ శ్రీను, రాజేష్‌గౌడ్, కప్పరి శ్రీను, నర్సింగ్ రావు, నాయకులు శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, మహేశ్వరీ, వసంత, రోహిత్, కరుణ్, విష్ణు, అమీర్, గౌజా, నరేష్, భాను పాల్గొన్నారు.

పాదచారులకు దారేది?

హైవేపై దూసుకుపోతున్న వాహనాలు
- రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారంగా పార్కింగ్
- కొనసాగుతున్న చిరువ్యాపారాలు


రద్దీగా ఉన్న తుక్కుగూడ బస్టాండ్ పరిసరాలు

తుక్కుగూడ: శ్రీశైలం జాతీయ రహదారి పై పెరుగుతున్న వాహనాల రద్దీతో రోడ్డు దాటడానికి బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. పుర పరిధి దేవేందర్‌నగర్ కాలనీ నుంచి మహేశ్వరం గేటు వరకు ఇదే పరిస్థితి. రోడ్డుకు ఇరువైపులా ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్, చిరువ్యాపారుల ఆక్రమణతో పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

వంతెన నిర్మిస్తే మేలు

శ్రీశైలం హైవేపై నిత్యం ఆర్‌జీఐ ఎయిర్‌పోర్ట్, శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వందల వాహనాలు పరుగులు తీస్తుంటాయి. వీటికి తోడు తుక్కుగూడ పరిసర ప్రాంతంలో హార్డువేరు పార్క్, ఈ– సిటీ, వండర్‌లా వినోద కేంద్రం, కలెక్టర్ సముదాయం ఉండటంతో ప్రాంతీయుల రాకపోకలతో రహదారి రద్దీగా ఉంటుంది. ఇక రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారాలు, వాహనాల పార్కింగ్‌తో కాలి నడకన వెళ్లే వారు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు దాటాలంటే భయాందోళన చెందుతున్నారు. తుక్కుగూడ బస్టాండ్ పరిసర ప్రాంతంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తే అందరికీ మేలని స్థానికులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

నియంత్రణ కరువు

పేరుకే జాతీయ రహదారి కానీ పూర్తిగా ఇరుకు రోడ్డు. దీనికి తోడు వ్యాపార, వాణిజ్య సంస్థల ఎదుట వాహనాల నిలిపివేత. పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల్లో విధులు నిర్వహించేందుకు వెళ్లేవారు బస్సు కోసం నిరీక్షణ. వెరసి బాటసారులకు ఇబ్బందిగా మారింది. రోడ్డు వెంట నడవలేరు. రోడ్డును దాటలేరు. యూటర్నులు, కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి వేగ నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు.. రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్‌ను అరికట్టి, పాద చారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ.. సమస్యల ఒడి

శిథిలావస్థ, ఇరుకు గదుల్లో నిర్వహణ
- కానరాని మౌలిక వసతులు
- ఇబ్బంది పడుతున్న చిన్నారులు, గర్భిణులు
- దృష్టి సారించని అధికారులు


క్రాంతిక్లబ్ ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలోకి చేరిన వర్షంనీరు (ఫైల్)

చంపాపేట: నవజాత శిశువుల నుంచి బాల్యదశలోని బిడ్డల సంపూర్ణ ఎదుగుదలకు దోహదపడేలా పౌష్టికాహారం అందించటంతో పాటు చిన్నారులకు పాఠశాల వాతావరణం అలవాటు చేసేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటి నిర్వహణలో భాగంగా చిన్నారులకు పౌష్టికాహారం అందించటంతో పాటు వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు పలు అంశాలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యాబోధన వంటి పలు అంశాలతో ప్రణాళికను కూడా ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల నిర్వహణకు స్త్రీ సంక్షేమ శాఖ ప్రతి ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంది. ఆయా అంగన్‌వాడీలలో మౌలిక సదుపాయాల కొరత రాజ్యమేలుతుంది. కేంద్రాలకు నిత్యం హాజరయ్యే చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీలో ఉన్న సమస్యల నడుమే గడపాల్సిన దుస్థితి నెలకొంది.

చినుకులకే కేంద్రాల్లోకి నీరు..

చంపాపేటలోని పోచమ్మగడ్డ, సుల్తానాఅల్వాలో, కర్మన్‌ఘాట్‌లోని శుభోదయ కాలనీ, క్రాంతి క్లబ్ ఆవరణలో, బైరామల్‌గూడ, పాతబస్తీలో మొత్తం ఆరు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో నాలుగు పురాతన శిథిలావస్థకు చేరిన భవనాల్లో మౌలిక వసతులు లేకపోవడంతో పాటు ఇరుకైన గదిలో నిర్వహిస్తుండగా మరో రెండు కేంద్రాలు అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. ఆరు అంగన్‌వాడీ కేంద్రాలలో ఆరుగురు టీచర్లు, 6 మంది కార్యకర్తలతో మూడు నుంచి 03–06 128 మంది చిన్నారులకు ప్రీప్రైమరీ విద్యను బోధిస్తున్నారు. సుల్తానాఅల్వా, కర్మన్‌ఘాట్ క్రాంతి క్లబ్ ఆవరణలోని కేంద్రాలు లోతట్టు ప్రాంతంలోని పురాతన భవనంలో నిర్వహిస్తుండటంతో చినుకు పడ్డా కేంద్రంలోకి నీరు చేరుతుండటంతో తల్లిదండ్రులు తమ చిన్నారులను పంపేందుకు వెనకడుగు వేస్తున్నారు.

ఎఫ్ఆర్సీలకే పరిమితం..

అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వర్తించే టీచర్స్‌కు నిత్యం 15, 18 విభాగాల రికార్డులైన కుటుంబ సర్వే, అనుబంధ పోషకాహార నిల్వలు, పూర్వ ప్రాథమిక విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు రేషన్, వారాంతపు టీకాలు, బాలింతలు, చిన్నారుల బరువు, ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలకు పౌష్టికాహార, ఆరోగ్య వివరాలు వంటి పలు రికార్డుల రాత పనిని నిర్వర్తించటంతో పాటు ఫేస్ రికగ్నైజ్ క్యాప్చర్ వంటి విధులు కూడా నిర్వర్తించాలి. ఉన్న కొద్ది పాటి సమయంలో టీచర్‌కు రికార్డులు రాసేందుకు సరిపోతుందని అది చాలదన్నట్లు ఆరోగ్యలక్ష్మీ, ఎంఎల్‌ఎంఎస్‌సీ వంటి సమావేశాలు ఉంటే తమ పిల్లలను చూసేదేవరని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టాయిలెట్స్ లేక ఇబ్బందులు

డివిజన్ పరిధిలోని నాలుగు కేంద్రాల్లో టాయ్‌లెట్స్ లేకపోవటంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని అత్యవసర పరిస్థితులలో చిన్నారులు కేంద్రాల సమీపంలో లేక.. రహదారులు పక్కన విసర్జన చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఇక గర్భిణులు, బాలింతలైతే ఇంటికి వెళ్లాల్సిన దుస్థితి దాపురిస్తుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో పౌష్టికాహారం తీసుకున్న తర్వాత తాగేందుకు చుక్కనీటి సౌకర్యం కూడా లేకపోవడంతో గర్భిణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి


గ్రంథాలయ పుస్తకాలను అందజేస్తున్న హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి

నాగోలు: విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని జైపురి కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం నాగోలు డివిజన్ జైపురికాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి గ్రంథాలయ తరగతిని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి గ్రంథాలయ పీరియడ్ నిర్వహణ తప్పని సరి చేస్తూ ఉపాధ్యాయులకు గ్రంథాలయ నిర్వహణలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.పాఠశాల గ్రంథాలయ నిర్వహణ సమితి ఏర్పాటు చేయడంలో భాగంగా ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి గ్రంథాలయ నిర్వహణ సమితి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను రోజు చదవడం, ఇంటికి పుస్తకాలు ఇవ్వడం, విద్యార్థులు నేర్చుకున్న విషయాలు తెలియజేస్తూ ప్రదర్శించడం లాంటివి నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రంథాలయ నిర్వహణ సమితి సభ్యులైన విద్యార్థులు లిఖిత, మీక్షిత, చందు ద్వారా విద్యార్థులకు పుస్తకాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంత రెడ్డి, గాయత్రి,రాజేశ్వరి విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

- కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్


బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న సుదర్శన్‌గౌడ్

కొత్తూరు: అత్యవసర పరిస్థితులు, ప్రమాదాల్లో గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందే పేదలు, మధ్య తరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో మేలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం పట్టణ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు అయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కంటే మెరుగ్గా కాంగ్రెస్ ప్రభుత్వం ఆపదలో ఉన్న వారికి చికిత్సల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ పథకాన్ని వర్తింపజేస్తోందన్నారు. ఇప్పటికే ఆయా కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందిన ఎంతో మంది పేదలకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థికంగా సాయం చేసినట్లు వివరించారు. ఎమ్మెల్యే శంకర్ సహకారంతో మున్సిపాలిటీలో రోడ్లు, మౌలిక సదుపాయాల పనులు జరగడం సంతోషకరమన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోండి


ఇన్వెస్టిచర్ వేడుకలో చైర్మన్ బీరప్ప తదితరులు

మీర్‌పేట: విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప అన్నారు. కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ లార్డ్స్ స్కూల్‌లో శనివారం ఇన్వెస్టిచర్ డే (పదవీ స్వీకార) వేడుక ఘనంగా జరిగింది. వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన బీరప్ప విద్యార్థి నాయకులుగా ఎన్నికైన వారికి బాధ్యతలు అప్పగించి ప్రమాణస్వీకారం చేయించారు. విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అలవర్చడం ద్వారా భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణిస్తారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత, డీన్ సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ మరియన్ పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం


ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకుడు సాంబశివ

పహాడీషరీఫ్: ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.రాఘవేందర్‌రెడ్డిని శనివారం బీఆర్ఎస్ నాయకుడు సిల్వేరీ సాంబశివ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి, సన్మానించారు. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు.

నేడు కొత్తపేటలో బోనాలు

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని వివిధ దేవాలయ వద్ద ఆదివారం బోనాల ఉత్సవాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మోహన్ నగర్‌లోని దుర్గామాత దేవాలయం నుంచి బాలాజీ నగర్ కాలనీలో బంగారు మైసమ్మ దేవాలయం ఎస్‌బీఐ కాలనీ పోచమ్మ దేవాలయం, చిత్తారమ్మ దేవాలయం నుంచి కమర్షియల్ టాక్స్ కాలనీ సీతలా మాత దేవాలయం , ఎస్ఆర్ఎల్ కాలనీ పోచమ్మ దేవాలయం, కొత్తపేట విలేజ్ ప్రసన్న మహంకాళి దేవాలయం, సత్యానగర్ మైసమ్మ దేవాలయం, బంగారు గవ్వల రేణుక ఎల్లమ్మ దేవాలయం వరకు అమ్మవారి ఘట ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు యశ్పాల్‌గౌడ్ తెలిపారు.

కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి

హస్తినాపురం: పదవ తరగతి పాసైన విద్యార్థులు పూర్తి ఫీజు చెల్లిస్తేనే టీసీ ఇస్తామని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న చైతన్య స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మానాయక్ డిమాండ్ చేశారు. పది పాసైన గిరిజన అమ్మాయికి ఫీజు బకాయి ఉన్నారని గాయత్రినగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యం టీసీ ఇవ్వక పోవడంతో గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం పాఠశాల ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యా సంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. స్పందించిన యాజమాన్యం టీసీ ఇవ్వడంతో ధర్నా విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలునాయక్, చందర్, రఘు, శ్రీను, రాజు, తారాసింగ్, భరత్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ


పిల్లలకు అన్నప్రాసన చేస్తున్న శాంతిశ్రీ

మహేశ్వరం: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందని మహేశ్వరం ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. శనివారం మండల పరిధి తుమ్మలూరు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన శిశువుకు వెంటనే ముర్రుపాలు పట్టిస్తే తల్లికి గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ రాదని చెప్పారు. పిల్లలకు ఆరోగ్య సమస్యలు తలెత్తవని తెలిపారు. అనంతరం 6 నెలల లోపు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భిణులు, తల్లులకు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్స్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పహాడీషరీఫ్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జల్‌పల్లి శ్రీరామకాలనీ నారాయణ పాఠశాలల జీఎం గోపాల్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన కేబినెట్ వేడుకలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. ఏజీఎం రవీంద్రబాబు, హైస్కూల్ ఆర్‌అండ్‌బీ శివ రంజని, మహేశ్వరీ, కో–ఆర్డినేటర్ సృజన్ రాథోడ్ పాల్గొని నాయకులుగా వ్యవహరించిన విద్యార్థులకు బ్యాడ్జీలను ధరింపజేశారు. కార్యక్రమంలో రీజినల్ స్టాఫ్ సిడిల్ డ్రైనర్ బోజిరెడ్డి, ప్రిన్సిపాల్ రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకంతో ఉద్యోగం


అపాయింట్‌మెంట్ లెటర్ అందజేస్తున్న చెకొలేకర్ లక్ష్మీ

చాదర్‌ఘాట్: హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో జూనియర్ మార్కెటింగ్ సూపర్‌వైజర్‌గా (జేఎంఎస్) విధులు నిర్వర్తిస్తున్న ప్రసాద్ అనే ఉద్యోగి మృతి చెందగా కారుణ్య నియామకం ద్వారా ఆయన కుమార్తె కొమ్ము స్రవంతికి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పించారు. శనివారం చైర్‌పర్సన్ చెకొలేకర్ లక్ష్మి, స్రవంతికి అపాయింట్‌మెంట్ లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. కారుణ్య నియామకాల్లో ఆలస్యం కాకూడదన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మరణించిన ఉద్యోగి ప్రసాద్ కుమార్తె స్రవంతికి త్వరగా అపాయింట్‌మెంట్ అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎస్ చిలుక నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, మార్కెట్ అధికారులు మాధురి, పుష్పలత, పవన్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


ఆరోగ్య కిట్లను అందజేస్తున్న వంశీకృష్ణ, నర్సింహారెడ్డి


కమలానగర్‌లో కిట్లను పంపిణీ చేస్తున్న నవజీవన్‌రెడ్డి


నాగోలులో రక్షణ కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అరుణ

మన్సూరాబాద్: పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి సూచించారు. మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలోని యోగా షెడ్ వద్ద శనివారం జీహెచ్ఎంసీ కార్మికులకు ఆరోగ్య కిట్లను అందజేసి మాట్లాడారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోజు పని సందర్భంలో ఎదురయ్యే ఆరోగ్య రక్షణకు కిట్లు సహాయ పడుతాయన్నారు. అనంతరం ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీఈ కనకయ్య, శానిటేషన్ డీఈ నీలిమ, జవాన్ శ్రీనివాసరావు, వాకర్స్ అసోసియేషన్ నేతలు వేమారెడ్డి, నాంపల్లి రామేశ్వర్, రామచంద్రారెడ్డి, కృష్ణ, రాజేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కమలానగర్‌లో..

వనస్థలిపురం: సీజనల్ వ్యాధులు రాకుండా మన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యం చూసుకోవాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని కమలానగర్, శారదానగర్, హుడా సాయినగర్ కాలనీలలో పారిశుద్ధ్య కార్మికులకు రక్షణపరికరాల కిట్లను పంపిణీ చేశారు.

నాగోలులో..

నాగోలు: పారిశుద్ధ్య సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. శనివారం నాగోలు డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి ఆమె రక్షణ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఈ నీలిమ, జవాన్ దర్శన్, ఎస్ఎఫ్ఏలు సురేష్, చారీ, ఆనంద్, రవి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను రైతులు వినియోగించుకోండి

చాదర్‌ఘాట్: రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి సూచించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడత నిధుల విడుదలకు సంబంధించిన ప్రధాన మంత్రి నరేంద మోదీ లైవ్ స్ట్రీమింగ్‌ను హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో రైతులకు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షింపజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9.70 కోట్ల మంది రైతులకు రూ. 20,500 కోట్ల నిధులు విడుదల చేయటం జరిగిందని, అవి నేరుగా రైతుల ఖాతాలో జమ చేయబడుతాయన్నారు. ఈ లబ్ధి పొందుతున్న రైతుల్లో 85 శాతానికి పైగా చిన్నకారు రైతులే అని ఇంత పెద్ద మొత్తంలో రైతుల ఖాతాల్లోకి నిధులను జమ చేయటం ప్రపంచంలోనే అతి పెద్ద బెనిఫిట్ మనీ ట్రాన్స్‌ఫర్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్–3 కార్యదర్శి పుష్పలత, సూపరింటెండెంట్ మాధురి, సూపర్‌వైజర్ పవన్, మార్కెట్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా మార్గంలో సేవా కార్యక్రమాలు


పాఠశాలలో పిల్లలను చేర్పిస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: మదర్ థెరిస్సా మార్గంలో నడుస్తు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఎవరికీ ఎలాంటి సహాయం కావాలన్నా నా వంతుగా సహాయం చేస్తానని మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటి అధ్యక్షులు చేవూరి శంకర్ తెలిపారు. ఇటీవల ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శశిధర్‌రెడ్డికి రక్తం కోసం వారి కుటుంబ సభ్యులు శంకర్‌ను ఆశ్రయించగా వెంటనే వారికి రక్తం సమకూర్చడంతో పాటు పాటు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. తమ పిల్లలకు ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని కోరడంతో వెంటనే పిల్లలు రోహిత్ రెడ్డి, అక్షిత్ రెడ్డిను పెద్ద అంబర్ పేటలోని రాష్ట్ర మైనార్టీ గురుకుల పాఠశాలలో చేర్పించి ఇంటర్ వరకు ఉచితంగా చదివే చర్యలు తీసుకుంటానని శంకర్ హామీ ఇచ్చారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386